క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

రాచర్ల: మండలంలోని సత్యవోలు సచివాలయం పరిధి రంగారెడ్డిపల్లెలో ఆదివారం సాయంత్రం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యేలం మురళీకృష్ణ శనివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు హాజరవుతారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మండలంలోని జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జగనన్న పాలవెల్లువను వినియోగించుకోవాలి

పుల్లలచెరువు: గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న పాల వెల్లువ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రోగ్రాం ఆధికారి డాక్టర్ నాగుల్‌మీరా కోరారు. శనివారం మండలంలోని శతకోడులో సర్పంచ్ పి.జ్యోతి ఆధ్వర్యంలో రైతులకు పాల వెల్లువపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగుల్‌మీరా మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు పాల వెల్లువ పథకం ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఏపీఎం వెంకటయ్య మాట్లాడుతూ స్త్రీనిధి, ఉన్నతి పథకాల ద్వారా గ్రామాల్లో ఎస్‌హెచ్‌జీ మహిళకు రూ.50 వేల నుంచి లక్ష వరకు రుణం పొంది పాడి పరిశ్రమను పెట్టుకుని జీవనోపాధి మెరుగు పర్చుకోవచ్చని సూచించారు.

మహిళా మార్ట్‌కు స్థలం కేటాయింపు

యర్రగొండపాలెం: మహిళలు వ్యాపార పరంగా ఎదగాలన్న ఉద్దేశంతో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో మహిళా మార్ట్ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలన్న రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అభ్యర్థన మేరకు కలెక్టర్ దినేష్‌కుమార్ అనుమతి ఇస్తూ ఉత్తర్వుజారీ చేశారు. ఈ ఉత్తర్వులు మార్కాపురం సబ్ కలెక్టర్, యర్రగొండపాలెం తహసీల్దార్‌లకుశనివారం అందాయి.ఈ మేరకు అక్కడ డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళామార్ట్‌ఏర్పాటుచేసేందుకుసన్నాహాలు చేస్తున్నారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగే అవకాశం ఉందని, మార్ట్ ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి ఆదిమూలపు సురేష్‌కు ఈ ప్రాంతం మహిళలు అభినందనలు తెలిపారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఆదర్శ బీఈడీ కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అండర్-14, అండర్-17 ఆటల పోటీలు ఉత్సాహభరితంగా జరిగినట్లు మండల కన్వీనర్ జి.శోభన్ తెలిపారు. అండర్-17 కబడ్డీ విన్నర్స్ గిద్దలూరు మండలం, అండర్-14 కబడ్డీ విన్నర్స్ రాచర్ల మండలం, అండర్-17 ఖో ఖో విన్నర్స్ గిద్దలూరు, అండర్-14 ఖో ఖో విన్నర్స్ బేస్తవారిపేట, అండర్-17 షటిల్ బ్యాట్మింటన్ సింగిల్స్ విన్నర్స్ గిద్దలూరు, అండర్-17 షటిల్ డబుల్ విన్నర్స్ కంభం మండలం, అండర్-14 షటిల్ డబుల్ విన్నర్స్ గిద్దలూరు, అండర్-17 త్రో బాల్ బాలురు విన్నర్స్ కంభం మండలానికి చెందిన క్రీడాకారులు గెలుపొందినట్లు ఆయన వివరించారు.

సచివాలయం తనిఖీ

కంభం: కందులాపురం-1 సచివాలయాన్ని ఎంపీడీఓ ఎస్.ప్రసాద్‌బాబు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. సచివాలయం పరిధిలో జరుగుతున్న సర్వేపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం కందులాపురం -2 సచివాలయంలో సర్వేపై అవగాహన సమావేశం నిర్వహించారు.

పంట నమోదుపై దృష్టి పెట్టాలి

తాళ్లూరు (ముండ్లమూరు): ఖరీఫ్‌లో సాగుచేసిన అన్ని రకాల పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేయడంపై సిబ్బంది దృష్టి పెట్టాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మండలంలోని దారంవారిపాలెం, తురకపాలెం గ్రామాల్లో పంట నమోదుపై శనివారం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. మండలంలో 5,715 ఎకరాల్లో 45 రకాల పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. మిగిలిన పంటలను త్వరగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.

భోజనం నాణ్యంగా వడ్డించాలి

రాచర్ల: విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని నాణ్యంగా వడ్డించాలని ఎంఈవో-2 వి.గిరిధర్ శర్మ అన్నారు. మండలంలోని ఆరవీటికోట ప్రాథమిక పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలన్నారు. భోజనంలో నాణ్యత లోపిస్తే నిర్వాహకులపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పాఠశాలకు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. అన్నీ సక్రమంగా ఉండటంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవో-1 శివకోటేశ్వరరావు, ఆరవీటికోట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహానందిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒక వైపు నిమజ్జనాలు..
మరో వైపు ప్రత్యేక పూజలు

- రూ.3.50 లక్షలతో వినాయకుడి ప్రత్యేక అలంకరణ
- ఉత్సాహంగా సాగుతున్న గణేష్ నవరాత్రులు


జగనన్న కటౌట్‌లతో యువకుల డ్యాన్స్

మార్కాపురం: పట్టణంలో గణేష్ నవరాత్రులు ఉత్సాహంగా సాగుతున్నాయి. సోమవారం నాడు ప్రారంభమైన వినాయక చవితి వేడుకలు పట్టణంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతుండగా మరికొన్ని చోట్ల నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని మెయిన్ బజారు, జవహర్‌నగర్ కాలనీ, తర్లుపాడు రోడ్డు, తూర్పు వీధి, రాజాజీ వీధి, 10వ వార్డుల్లో వినాయకునికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పదో వార్డులో విఘ్నేశ్వరుడిని 3,50,116 రూపాయల కరెన్సీ నోట్లతో చేసిన అలంకరణ ప్రత్యేకంగా నిలిచింది. పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకుంటున్నారు. కంభం రోడ్డులో వివిధ వినాయక విగ్రహాల నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. స్వామి వారికి 5 రోజుల పాటు నియమ నిష్టలతో పూజలు నిర్వహించిన అనంతరం శనివారం తీన్‌మార్ డప్పులతో, టపాసులు పేల్చుతూ నిమజ్జనానికి తరలించారు. స్వామి వారి ప్రసాదమైన లడ్డూలను వేలంపాట వేయగా భక్తులు అధిక ధరలకు దక్కించుకున్నారు.

జగనన్న పాటలతో హోరు

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడు, నేకునాంబాద్ గ్రామాల్లో వినాయక మండపాల్లో పూజలందుకున్న గణనాథుల నిమజ్జనం కోసం శనివారం ట్రాక్టర్లపై కంభం చెరువు కట్టకు తరలించారు. బేస్తవారిపేట బస్టాండ్ ఆవరణలో బాణసంచా కాల్చుతూ కుంకుమ చల్లుకుంటూ డీజేతో జగనన్న పాటలతో హోరెత్తించారు. జగనన్న భారీ కటౌట్‌లు పట్టుకుని డ్యాన్స్‌లు వేస్తూ సందడి చేశారు.

కోలాహలంగా వినాయక నిమజ్జనం

ముండ్లమూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను శనివారం నిమజ్జనం చేశారు. మారెళ్ల, గంగనపాలెం, ముండ్లమూరు, తమ్మలూరు గ్రామాల్లో వినాయక విగ్రహాలను కోలాహలంగా ఊరేగించారు. యువతీయువకులు ఉత్సాహంగా గులాములు చల్లుకుంటూ జై గణేషా, జై జై గణేషా అంటూ నినాదాలు చేస్తూ విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ముండ్లమూరులో రెడ్డి యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద రెండు కేజీల లడ్డూను వైఎస్సార్ సీపీ నాయకుడు, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి రూ.10,116కు వేలంపాటలో దక్కించుకున్నారు.


నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు


ముండ్లమూరులో వినాయక విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న యువకులు

కొనకనమిట్ల: వినాయక చవితి పండగ సందర్భంగా స్వామివారి నిమజ్జన ఉత్సవ కార్యక్రమాలు కోలాహలంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సంబరాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం మండలంలోని గొట్లగట్టు, చినారికట్ల, చింతగుంట గ్రామాల్లో వినాయకుని విగ్రహాలను వైభవంగా నిమజ్జనం చేశారు. గొట్లగట్టులో ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొనగా మహిళలు కోలాటం ప్రదర్శించారు. ముందుగా వినాయకునికి విశేష ఉత్సవ పూజలు చేశారు. వినాయకునికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూలకు వేలంపాటలు నిర్వహించారు. యువకులు రంగురంగుల గులాంలు చల్లుకుంటూ ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు. మండలంలోని చింతగుంటలో రామాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహానికి ఉత్సవం నిర్వహించారు. వినాయకుని లడ్డూ పాటలో గ్రామానికి చెందిన అమిరెడ్డి శివశంకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి బ్రదర్స్ రూ.40 వేలకు దక్కించుకున్నారు. వారికి కమిటీ తరపున మేళతాళాలతో లడ్డూను అందజేశారు.


గొట్లగట్టులో మహిళల కోలాటం


వ్యాసరచన విజేతలతో కలెక్టర్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే కేపీ

ఆకట్టుకున్న ఫోక్ డ్యాన్స్

- జిల్లాస్థాయి క్విజ్, వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం టౌన్: ఇగ్నైట్ యంగ్ మైండ్స్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, ఫోక్ డ్యాన్స్‌లో విద్యార్థులు పోటాపోటీగా పాల్గొని తమ ప్రతిభ చాటారు. శనివారం మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో జిల్లాలోని 89 పాఠశాలలు పేర్లు నమోదు చేసుకోగా 52 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను కలెక్టర్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డితోపాటు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు.


ఫోక్ డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

మోడల్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

పెద్దదోర్నాల: మండల పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావటంపై ప్రధానోపాధ్యాయుడు సతీష్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ సిద్దయ్యలు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు వివిధ క్రీడల్లో రాణించటంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాలకు చెందిన ఈశ్వర్ (ఖోఖో), ఖాదర్‌బాషా, ఆకాష్‌రెడ్డి (యోగ) నరసింహారెడ్డి, వీరారెడ్డి, ఖాదర్‌బాష, ఆకాష్‌రెడ్డి, అనంతరాములు, శివ, ఆంజనేయులు, ఈశ్వర్ (త్రోబాల్) విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావటంపై వారు హర్షం వ్యక్తం చేశారు.


పోటీలకు ఎంపికైన మోడల్ పాఠశాల విద్యార్థులు

రంగస్వామి హుండీ ఆదాయం రూ.91,558

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు సమీపంలో ఉన్న నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి దర్శనం కోసం భక్తులు క్యూలో నిలబడి దర్శనం చేసుకున్నారు. దీంతో స్వామి వారి హుండీ ఆదాయం రూ.91,558 వచ్చినట్లు ఆలయా కార్యనిర్వాహణాధికారి రమేష్ తెలిపారు. ఆలయాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు శ్రీ కృష్ణదేవరాయుల కాపుబలిజ, కాశినాయన రెడ్ల, శ్రీ గోపాలకృష్ణయాదవ, యోగివేమన రెడ్ల, ఆర్య వైశ్య అన్నదాన సత్రాల్లో కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కన్నసాని చిన్న ఓబులేసు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న హౌసింగ్ నిర్మాణాలు వేగవంతం

త్రిపురాంతకం: జగనన్న హౌసింగ్ లేఔట్‌లో ఇంతవరకు ప్రారంభించని నిర్మాణాలను పూర్తి చేసేందుకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ చొరవతో ప్రత్యేకంగా నిర్మాణ పనులు ప్రారంభించినట్లు ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి పేర్కొన్నారు. త్రిపురాంతకం జగనన్న లేఔట్‌లో నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు శంకుస్థాపన కార్యక్రమాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న హౌసింగ్ కాలనీలో ఇప్పటి వరకు 218 గృహాల నిర్మాణం చేపట్ట లేదన్నారు. వీటన్నింటినీ దశలవారీగా పూర్తిచేసే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేసేందుకు అధికారులు దృష్టి సారించాలన్నారు. హౌసింగ్ డీఈఈ ఎస్‌వీ సురేష్‌బాబు మాట్లాడుతూ ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఎంపీడీఓ సాంబశివరావు, ఏఈ డి.శ్రీనివాసులు, సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రసాద్, మోహన్‌దాస్ పాల్గొన్నారు.


నిర్మాణ పనులు ప్రారంభించిన ఎంపీపీ, అధికారులు

నర్సరీలకు లైసెన్సులు ఉండాలి

గిద్దలూరు రూరల్: నర్సరీలు నిర్వహించే వారు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలని ఉద్యానవనశాఖాధికారి విష్ణుప్రియ అన్నారు. మండలంలోని ముండ్లపాడు నర్సరీలను ఆమె శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నర్సరీలు నిర్వహించే వారు ప్రభుత్వ అనుమతులు తీసుకుని నిబంధనల మేరకు నర్సరీలను నిర్వహించాలని సూచించారు. రైతులకు విక్రయించే మొక్కలకు తప్పని సరిగా రసీదులు ఇవ్వాలని కోరారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాచర్ల: పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని అనుములపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. అనుములపల్లె గ్రామానికి చెందిన సిరిగిరి రంగనాయకులు (52) వారం క్రితం పురుగు మందు తాగడంతో ప్రత్యేక వాహనంలో గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం ఒంగోలులో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

ఉపాధి పనులకు రూ.6 కోట్లు ఖర్చు

కొమరోలు: ఉపాధి హామీ పనుల్లో భాగంగా మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 6.08 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు బేస్తవారపేట ఎస్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ భాస్కర్ తెలిపారు. మండలంలోని దద్దవాడ, నల్లగుంట్ల గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులను భాస్కర్ క్షేత్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయాల్లో సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఎంబుక్ రికార్డ్‌ను పరిశీలించారు. ఏపీఓ మహాలక్ష్మి, టీఏలు శ్రీనివాసులు, కోటిరెడ్డి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్బీకే సేవలను వినియోగించుకోవాలి

గిద్దలూరు రూరల్: రైతు భరోసా కేంద్రాల సేవలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక వ్యవసాయశాఖాధికారి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బురుజుపల్లెలో కంది పంటలను ఆయన శనివారం పరిశీలించారు. కంది పంటలను ఆశించే వెర్రి తెగులు, దాని నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కంది పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రైతులకు ఎటువంటి సందేహాలు ఉన్నా దగ్గరలోని రైతు భరోసా కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించి వారి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ ఎరువు అందుబాటులో ఉన్నాయన్నారు. సాంకేతిక వ్యవసాయశాఖాధికారి మహబూబ్‌బాష, రైతు భరోసా కేంద్ర సిబ్బంది ఉన్నారు.


పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

అన్నదానం ప్రారంభించిన ఎమ్మెల్యే కేపీ


అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: పట్టణంలోని కంభం రోడ్డు సిఫానీ బజారులో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సంతాన విఘ్నేశ్వరస్వామి వారికి శనివారం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందరూ ఐక్యంగా ఉండి విఘ్నేశ్వర నవరాత్రులను నిర్వహించడం అభినందనీయమని కమిటీ సభ్యులను మెచ్చుకున్నారు. అనంతరం 20వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ షేక్ సలీం, శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానం కమిటీ సభ్యులు నాలి కొండయ్య యాదవ్, సచివాలయం అధ్యక్షుడు షేక్ కరీముల్లా, షేక్ సుభానీ, నిర్వాహకులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు కేపీ నాగార్జునరెడ్డిని ఘనంగా సన్మానించారు.

మెడికల్ క్యాంపును వినియోగించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న పాముల వెంకట సుబ్బయ్య


ఇంటి వద్ద వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బేస్తవారిపేట: జగనన్న సురక్షలో భాగంగా నిర్వహించే మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి పృద్వీరాజ్ అన్నారు. బేస్తవారిపేటలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను ఆయన శనివారం తనిఖీ చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్నారు. బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. ఈ నెల 30వ తేదీన బేస్తవారిపేట సచివాలయం-1, అక్టోబర్ 5న సచివాలయం-2 పరిధిలో స్పెషలిస్ట్ డాక్టర్లతో మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారు ముందుగా టోకెన్లు తీసుకోవాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీలు సర్దార్, ప్రతిమ, ఎంపీహెచ్‌ఏ ఎం.వెంకటేశ్వర్లు, కాశీ విశ్వనాథరావు, అబ్దుల్లా, సచివాలయ ఏఎన్ఎం మాధవి పాల్గొన్నారు.

జగనన్న సురక్షను విజయవంతం చేయాలి

గిద్దలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అందరం కలిసికట్టుగా విజయవంతం చేయాలని చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమంపై శనివారం ఏఎన్ఎంలు, వలంటీర్లు, ఆశా కార్యకర్తలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కమిషనర్ వై.రామకృష్ణయ్య వైస్ చైర్మన్‌లు ఆర్‌డీ రామకృష్ణ, కాతా దీపికా, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో ముండ్లమూరు విద్యార్థుల సత్తా

ముండ్లమూరు: దర్శి నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో ముండ్లమూరు విద్యార్థులు సత్తాచాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 21, 22 తేదీల్లో దర్శిలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి పోటీల్లో పలు విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పీడీ భవన్నారాయణ తెలిపారు. హైజంప్ అండర్-14 బాలుర విభాగంలో తాతపూడి దినేష్ మొదటి స్థానం, త్రోబాల్‌లో గండి దేవసహాయం, చల్లా మణికంత, టెన్నికాయిట్‌లో వరగాని రాజేష్, దాసరి నైసన్‌బాబు, వరగాని ధనుష్, టెన్నికాయిట్ బాలికల విభాగంలో మీనిగ రేణుక, గోళ్లపాటి వైష్ణవి, త్రోబాల్‌లో తాతపూడి దీక్ష విజయం సాధించినట్లు వివరించారు. అండర్-17 బాలుర విభాగం 200 మీటర్ల పరుగు పందెంలో కాకునూరి వంశీ ద్వితీయ స్థానం, ఎనుముల సాయిచరణ్ ట్రిపుల్ జంప్‌లో మొదటి స్థానం, 800 మీటర్ల పరుగు పందెంలో బిజ్జం శివారెడ్డి మొదటి స్థానం, హైజంప్‌లో తాతపూడి జస్సీపాల్ మొదటి స్థానం, త్రోబాల్‌లో కొమ్ముల నాగచరణ్, రావుపల్లి లవకుమార్, సాయిచరణ్, డిస్క్‌త్రోలో కొండవీటి రాకేష్ తృతీయ స్థానం సాధించారు. అండర్-17 బాలికల విభాగం త్రోబాల్‌లో కొంకా అమృతవర్షిణి, శ్రీలక్ష్మి విజయం సాధించినట్లు పీడీ తెలిపారు.

మానసిక వికలాంగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ

గిద్దలూరు రూరల్: రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ 39వ రైసింగ్ డే సందర్భంగా పట్టణ శివారులోని కొత్తపల్లె రోడ్డు మానసిక వికలాంగుల విద్యార్థుల పాఠశాలలో శనివారం రైల్వే అధికారులు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. రైసింగ్ డే వేడుకల్లో భాగంగా రైల్వే ఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో మానసిక వికలాంగ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. విద్యను అంకిత భావంతో అభ్యసించాలని ఆకాంక్షించారు. కానిస్టేబుల్ శేషయ్య, పాయింట్స్‌మెన్ మురళి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.


పండ్లు పంపిణీ చేస్తున్న రైల్వే సిబ్బంది

ప్రకృతి ప్రసాదించే ఆహారంతో ఎంతో శక్తి


కార్యక్రమంలో పాల్గొన్న రమణ, తదితరులు

దర్శి: ప్రకృతి ప్రసాదించే ఆహార పదార్థాలు ఎంతో శక్తినిస్తాయని పోషణ్ అభియాన్ హెచ్‌ఎస్ జీ రమణ అన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శనివారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. నిత్యావసర సరుకులు, కూరగాయలతో చక్కగా శక్తినిచ్చే ఆహార పదార్థాలు తయారు చేశారు. ఆశా కార్యకర్త సుశీల, సిబ్బంది పాల్గొన్నారు.